సాక్షి
మహబూబాబాద్
మంగళవారం । 25 । జూలై । 2023



'సాగు' ముమ్మరం
ఇటీవల కురుస్తున్న వర్షాలతో వివిధ పంటల సాగులో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు పలు సూచనలు చేశారు. - 8లో▸



కాళోజీ ఖ్యాతిని తెలిపేలా నిర్మాణం
కాళోజీ ఖ్యాతిని తెలిపేలా కాళోజీ కళాక్షేత్రం నిర్మాణం ఉండాలని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
29.2⁰/22.4⁰

వాతావరణం
జిల్లాలో ఉదయం నుంచి వర్షం కురుస్తుంది. పలుచోట్ల భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



నెహ్రూసెంటర్: హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రగతిశీల హమాలీ మిల్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి పర్వత కోటేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని లేబర్ కార్యాలయంలో సహాయ కార్మికశాఖ అధికారి రమేష్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కోటేష్ మాట్లాడుతూ.. సంక్షేమ బోర్డు లేకపోవడంతో కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, బీమా వంటి సౌకర్యాలు కల్పించాలని, 55 సంవత్సరాలు నిండిన కార్మికులకు నెలకు రూ.6వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. హమాలీ కార్మికులకు డబుల్‌బెడ్రూం ఇళ్లు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సురేష్, లింగన్న, రామ్మూర్తి, మారగాని ఉప్పలయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అవగాహన పెంచుకోవాలి



నెహ్రూసెంటర్: వ్యాధుల నిర్ధారణ పరీక్షలపై ఆరోగ్య కార్యకర్తలు అవగాహన పెంచుకోవాలని డీఎంహెచ్ఓ హరీశ్‌రాజ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఐఎంఏ హాల్‌లో ఆరోగ్య కార్యకర్తలకు వ్యాధి నిర్ధారణ పరీక్షలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ..టీబీ వ్యాధి ఒక బ్యాక్టీరియా వల్ల వస్తుందని,ఈ వ్యాధి ఒకరి నుంచి మరొకరికి గాలిద్వారా వ్యాప్తి చెందుతుందన్నారు. సీజనల్‌వ్యాధుల బారిన పడకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు మురళీధర్,సుధీర్‌రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్ఓ అంబరీష, ఐసీ డిప్యూటీ డెమో కేవీ రాజు, డీపీఎంఓ రవీందర్‌రావు, రు క్ముద్దీన్, సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్ శ్రీధర్, జవహర్, శ్వేత, డీపీపీఎం అశోక్, హెల్త్ ఎడ్యుకేటర్ పురుషోత్తం, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

చట్టపరంగా చర్యలు తీసుకుంటాం

- ఎస్పీ శరత్‌చంద్ర పవార్



మహబూబాబాద్ రూరల్: బాధితులకు అండగా ఉంటూ, వచ్చిన ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులతో వచ్చిన ఫిర్యాదులపై ఎస్పీ మాట్లాడారు. బాధితులకు సత్వరమే న్యాయం చేయాలని ఆదేశించారు. చట్ట వ్యతిరేకంగా వ్యవహరిస్తూ శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిపై, మహిళలకు వ్యతిరేకంగా జరిగే నేరాలపై కఠినంగా వ్యవహరించాలని అధికారులకు ఎస్పీ సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలోని మైనార్టీ గురుకుల పాఠశాలల్లో అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన టీచింగ్ పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ శాఖ ఇన్‌చార్జ్ అధికారి శ్రీనివాస్ సోమవారం తెలిపారు. మానుకోట బాలుర పాఠశాలలో పీజీటీ ఇంగ్లిష్ పోస్టు-1, డోర్నకల్ బాలికల గురుకుల పాఠశాలలో పీజీటీ ఇంగ్లిష్-1, ఫిజికల్ సైన్స్-2 పోస్టులు ఖాళీలు ఉన్నాయన్నారు. ఇంగ్లిష్ సబ్జెక్ట్‌లో పీజీ, బీఈడీ, ఫిజికల్ సైన్స్ సబ్జెక్ట్‌లో పీజీ, బీఈడీ ఉత్తీర్ణత సాధించి, బోధనలో అనుభవం ఉండి జిల్లాకు చెందిన అభ్యర్థులు అర్హులన్నారు. అభ్యర్థులు తమ బయోడేటాను ఈ నెల 25నుంచి 28వ తేదీ సాయంత్రం 4గంటల వరకు జిల్లా కేంద్రంలోని మైనార్టీశాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు. అభ్యర్థులకు డెమో హైదరాబాద్ మైనార్టీ శాఖ కార్యాలయంలో, మైనార్టీ గురుకులంలో నిర్వహిస్తారన్నారు. పూర్తి వివరాలకు 7396691373, 9885983942 నంబర్లలో సంప్రదించాలన్నారు.

నేడు, రేపు భారీ వర్షాలు

హన్మకొండ: ఉపరితల ఆవర్తనం మూలంగా ఈనెల 25, 26 తేదీల్లో హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లో అక్కడక్కడా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. అలాగే ములుగు, జనగామ, జేఎస్ భూపాలపల్లి జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశముందని, అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

కట్ల తీగలు.. ముళ్ల పొదలు

అధ్వానంగా బయ్యారం పెద్దచెరువు కాల్వలు

- చాలాచోట్ల కాల్వ కట్టల ధ్వంసం
- మరమ్మతులు చేపట్టడంలో నిర్లక్ష్యం
- చెరువు నిండినా.. మడి పారే దిక్కులేదు
- ఆందోళనలో ఆయకట్టు రైతులు



ఇర్సులాపురంలో తూటికాడ చెత్తతో నిండిన పెద్దకాల్వ

బయ్యారం: కాకతీయుల కాలంలో నిర్మించిన బయ్యారం పెద్ద చెరువు కాల్వలు అధ్వానంగా మారాయి. కాల్వల్లో కట్టతీగలు, ముళ్లపొదలు ఏపుగా పెరిగాయి. అలాగే చాలా చోట్ల గండ్లు పడ్డాయి. కాల్వ కట్టలు ధ్వంసమయ్యాయి. కాగా ఏటా చెరువు నిండిన తరువాత తాత్కాలిక మరమ్మతుల చేపడుతూ ప్రజాధనాన్ని నీటిపాలు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఫలితంగా ఈ ఏడాది సైతం కాల్వల మరమ్మతులు, పూడికతీత పనులు ఎప్పుడు చేస్తారోనని ఆయకట్టు పరిధిలోని రైతులు ఎదురుచూస్తున్నారు.

సాగు ఇలా..

బయ్యారం పెద్దచెరువు కింద అధికారిక లెక్కల ప్రకారం 6,700 ఎకరాలు, అనధికారికంగా మరో 7,200 ఎకరాల భూమి సాగవుతోంది. కాగా చెరువుకు 2005వ సంవత్సరం వరకు పాలకులు ఎలాంటి నిధులు వెచ్చించిన దాఖలాలు లేవు. 2005లో కురిసిన భారీ వర్షాలకు పెద్దచెరువు కట్టకు గండి పడింది. కాగా చెరువుతో పాటు కాల్వల శాశ్వత మరమ్మతులకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి 10.84 కోట్ల నిధులు విడుదల చేశారు. పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ కేవలం కట్ట మరమ్మతులు పూర్తి చేసి కాల్వల పనులు చేయకుండా వదిలేశాడు. తర్వాత పలువురు పాలకులు మారినప్పటికీ ఇప్పటి వరకు కాల్వల శాశ్వత మరమ్మతులకు నిధులు విడుదల చేయలేదు. దీంతో ఆయకట్టు పరిధిలోని కోటగడ్డ, కొత్తపేట, గంధంపల్లి, సంతులాల్‌పోడుతండా, సత్యనారాయణపురం, ఇర్సులాపురం, కట్టుగూడెం, బండ్లకుంట, జగ్నాతండా, జాఫ్రబాద్, వెంకట్రాంపురం, సంగ్యాతండా, బయ్యారం, రంగాపురం, జగ్గుతండా, బంజర తండా గ్రామాల పరిధిలోని రైతులు ప్రతి సంవత్సరం కాల్వల మరమ్మతుల కోసం చెరువు నిండిన తర్వాత ఎదురు చూడాల్సి వస్తోంది.



ఆనవాళ్లు లేకుండా పోయిన గుండోరికాల్వ



చెత్తతో కట్టుగూడెం వద్ద నిండిపోయిన పెద్దకాల్వ

కాల్వల పరిస్థితి ఇది..

కాల్వల్లో పూడికతో పాటు చెట్లు పెరిగాయి. దీంతో నీటి ప్రవాహం సరిగా జరగక పలు చోట్ల గండ్లు పడుతున్నాయి. కాల్వ పై భాగంలో ఉన్న భూములకు నీటిని అందించేందుకు నిర్మించిన డ్రాప్ట్‌లకు పలుచోట్ల గండ్లు పడడంతో పరిధిలోని రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు కాల్వల నుంచి రైతులకు నీరందించేందుకు ఏర్పాటు చేసిన బుర్రలకు షట్టర్లు లేకపోవడంతో ఆయకట్టు పైభాగంలో నీరు వృథాగా పోయి చివరి ఆయకట్టుకు చుక్కనీరు అందడం లేదు.

ఆయకట్టు ఇలా..

పెద్ద చెరువు పరిధిలో అధికారిక లెక్కల ప్రకారం పెద్దకాల్వ 10.05 కిలోమీటర్ల పొడవు ఉండగా దీని పరిధిలో 3,800 ఎకరాలు, గుండ్లోరి కాల్వ 5.70 కిలోమీటర్లు ఉండగా 1,330 ఎకరాలు, నక్కల కాల్వ 1.50 కిలోమీటర్లు ఉండగా 100 ఎకరాలు, గుట్టకాల్వ 2.34 కిలోమీటర్లు ఉండగా 180 ఎకరాలు, తునికికాల్వ 3.45 కిలోమీటర్లు ఉండగా 710 ఎకరాలు, ధర్మపురి కాల్వ 1.53 కిలోమీటర్లు ఉండగా 380 ఎకరాలు, పెరుగుబుడ్డికాల్వ 1.59 కిలోమీటర్లు ఉండగా 100 ఎకరాలు, రాంపూరి కాల్వ 1.35 కిలోమీటర్లు ఉండగా దీని పరిధిలో 100 ఎకరాలు సాగవుతున్నట్లు నీటిపారుదల శాఖాధికారులు పేర్కొంటున్నారు.

ఏటా ఇవే తిప్పలు

చెరువులో నిండా నీరు ఉన్నప్పటికీ కాల్వలు సరిగా లేక నాట్లు వేయలేని పరిస్థితి. ప్రతి ఏడాది కాల్వలను సకాలంలో మరమ్మతులు చేయించక మమ్ముల్ని తిప్పలు పెడుతున్నారు. మాటలు చెప్పే వారే తప్ప పనులు చేసే వారు కరువయ్యారు.



– బచ్చలి రామారావు, రైతు, బయ్యారం

పూడికతీత పనులు ప్రారంభిస్తాం

పెద్దచెరువు ఆయకట్టు పరిధిలో చెత్తతో నిండిపోయిన పెద్దకాల్వ, గుండ్లోరి తదితర కాల్వల్లో పూడికతీత పనులను త్వరలోనే ప్రారంభిస్తాం. టెండర్ ప్రక్రియ ఆలస్యం కావడంతో పనులను సకాలంలో ప్రారంభించలేకపోయాం. రైతులకు ఇబ్బంది లేకుండా వెంటనే పనులు చేపట్టేలా చర్యలు చేపడుతున్నాం.

– శ్రీకాంత్, ఇరిగేషన్ ఏఈ, బయ్యారం

కేసీఆర్ పాలన సంక్షేమానికి స్వర్ణయుగం

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



ఉపాధి కూలీలకు లంచ్ కిట్లు అందిస్తున్న మంత్రి

తొర్రూరు: సీఎం కేసీఆర్ పాలన సంక్షేమానికి స్వర్ణయుగం అని రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మంత్రి కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఎర్రబెల్లి ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం డివిజన్ కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఈజీఎస్ కార్మికులకు లంచ్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ సంపద పెంచి పేదలకు పంచారని, పెద్ద కొడుకులా వృద్ధులకు పింఛన్లు అందిస్తున్నారన్నారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలతో పేదింట్లో వెలుగులు నింపారన్నారు. కాంగ్రెస్ పాలనలో రెండు,మూడు రోజులకు ఒకసారి మంచినీళ్లు వచ్చేవని, ఇప్పుడు మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ సురక్షిత తాగునీరు అందిస్తున్నామని తెలిపారు. గొర్రెల పంపిణీ పథకం ద్వారా రాష్ట్రంలో మాంసం ఉత్పత్తి గతంలో పోల్చితే 22 శాతం పెరిగిందన్నారు. చేపల ఉత్పత్తిలోనూ దూసుకుపోతున్నామన్నారు. తెలంగాణ భవిష్యత్ ఆశాకిరణం కేటీఆర్ అని, ఆయన నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రబల శక్తిగా మారిందన్నారు. కేటీఆర్ నాయకత్వంలో నూతన పరిశ్రమలు వస్తున్నాయని, లక్షలాది మందికి ఉపాధి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు, ఈజీఎస్ రాష్ట్ర డైరెక్టర్ లింగాల వెంకటనారాయణగౌడ్, వైస్ ఎంపీపీ శ్యామ్‌సుందర్‌రెడ్డి, నాయకులు సురేందర్‌రెడ్డి, కుర్ర శ్రీనివాస్, రాయిశెట్టి వెంకన్న, నకిరెకంటి కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం మాటలు నమ్మి మోసపోవద్దు

- మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు రేవూరి



ధర్నాలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

మహబూబాబాద్: సీఎం కేసీఆర్ మాయమాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేశారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్ కొంతమంది పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇచ్చి చేతులు దులుపుకొని, ఇప్పుడు గృహలక్ష్మి పథకం పేరుతో పేదలను మళ్లీ మోసం చేస్తున్నారని మండిపడ్డారు. డబుల్ బెడ్రూం ఇళ్ల విషయంలో ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తప్పుడు వాగ్దానాలతో సీఎం కేసీఆర్ మళ్లీ ప్రజల వద్దకు వస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కుటుంబ పాలన సాగుతోందని, వనరులన్నీ ఆంధ్రా కాంట్రాక్టర్ల చేతిలో పెట్టి కమీషన్లు దండుకుంటున్నట్లు ఆరోపించారు. సాగునీటి ప్రాజెక్టులను సీఎం కేసీఆర్ ఏటీఎం లాగా వాడుకుంటున్నారన్నారు. బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జాటోత్ హుస్సేన్‌నాయక్ మాట్లాడుతూ.. తెలంగాణ సెంటిమెంట్‌ను అడ్డుపెట్టుకొని కేసీఆర్ అధికారంలోకి వచ్చారన్నారు. ఆ సమయంలో భూకబ్జాదారులకు టికెట్లు ఇచ్చినా.. ప్రజలు ఓట్లు వేశారన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్‌రెడ్డి, వద్దిరాజ్ రాంచందర్‌రావు, యాప సీతయ్య, ఆకుల శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, మహేష్, శ్యాంసుందర్ శర్మ, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

వినతులు త్వరగా పరిష్కరించాలి

- కలెక్టర్ శశాంక



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శశాంక

మహబూబాబాద్: ప్రజావాణిలో ఇచ్చిన వినతులు త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పెండింగ్ వినతులు కూడా వెంటనే పరిష్కరించాలన్నారు. సత్వర పరిష్కారం కోసమే ప్రజావాణి కార్యక్రమం అనే విషయాన్ని అధికారులు గుర్తుపెట్టుకోవాలన్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయకుండా పని చేయాలన్నారు. మహబూబాబాద్ పట్టణానికి చెందిన ఇంతియాజ్ తన భార్యకు అనారోగ్యం కారణంగా వరంగల్‌లో ఉంటున్నామని, తన కూతూరు మానుకోట కేవీలో చదువుతుందని, వరంగల్ కేవీకి ట్రాన్స్‌ఫర్ పెట్టుకోగా.. జనన ధ్రువీకరణ పత్రంలో వయసు తక్కువగా ఉందని, సరిచేయాలని వినతి ఇచ్చాడు. స్థానిక విలేకరులకే ఇంటి స్థలాలు, డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలని టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు మట్టూరి నాగేశ్వర్‌రావు వినతిపత్రం అందజేశారు. స్థానికంగా ఐదేళ్ల అక్రిడిటేషన్, ఆధార్ కార్డు, ఓటరుకార్డును పరిగణనలోకి తీసుకోవాలని, స్థానికేతరులకు ఇవ్వవద్దని వినతిలో పేర్కొన్నారు. ప్రజావాణిలో 192 వినతులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డేవిడ్, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యం

పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ శశాంక అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అధికారులతో కలెక్టర్ పారిశుద్ధ్యంపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మండల ప్రత్యేకారులు తమకు కేటాయించిన హాస్టళ్లను పర్యవేక్షించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా శానిటేషన్‌పై దృష్టి పెట్టాలన్నారు. హరితహారం ప్రణాళికలు రూపొందించాలన్నారు.

మొక్కలు నాటిన కలెక్టర్..

హరితహారంలో భాగంగా కలెక్టరేట్ ఆవరణలో కలెక్టర్ శశాంక మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి సూర్యనారాయణ, జెడ్పీ సీఈఓ రమాదేవి, మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి పాల్గొన్నారు.

అధికారులు చర్యలు తీసుకోవాలి

ఓటర్లు తమ ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో వినియోగించుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శశాంక ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో రాబోయే ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగం, ఇతర అంశాలపై ఎస్పీ శరత్‌చంద్రపవార్‌తో కలిసి రెవెన్యూ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఏఈఆర్‌ఓలు, ఎస్‌హెచ్‌లు సెక్టార్ అధికారులు బృందంగా ఏర్పడి సమస్యాత్మక గ్రామాల్లో పర్యటించి సమస్యలపై అవగాహన చేసుకోవాలన్నారు. యాక్షన్ ప్లాన్‌తో ముందుకెళ్లాలని సూచించారు. అదనపు కలెక్టర్ డేవిడ్ ఉన్నారు.

అన్ని దానాల్లో.. రక్తదానం మిన్న

- తండ్రికి తగ్గ తనయుడు మంత్రి కేటీఆర్
- మంత్రి సత్యవతి రాథోడ్
- ఘనంగా కేటీఆర్ జన్మదినం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సత్యవతిరాథోడ్, ఎమ్మెల్యే శంకర్‌నాయక్

మహబూబాబాద్: అన్ని దానాల్లోకెల్లా రక్తదానం మిన్న అని రాష్ట్ర మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం మంత్రి కేటీఆర్ జన్మదినం సందర్భంగా మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించి మాట్లాడారు. మంత్రి కేటీఆర్ తండ్రికి తగ్గ తనయుడని కొనియాడారు. ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, జెడ్పీ చైర్‌పర్సన్ ఆంగోత్ బిందు, ఎమ్మెల్యే సతీమణి సీతామహాలక్ష్మి, మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మహ్మద్‌ఫరీద్ పాల్గొన్నారు.

విద్యా, ఐటీ రంగాల్లో అభివృద్ధి

మహబూబాబాద్ అర్బన్: మంత్రి కేటీఆర్ రాష్ట్రంలో విద్యా, ఐటీ రంగాలను అభివృద్ధి దిశలో తీసుకెళ్తున్నారని మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో సోమవారం నిర్వహించిన మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలకు మంత్రి సత్యవతిరాథోడ్, ఎమ్మెల్యే శంకర్‌నాయక్, జెడ్పీ చైర్మన్ ఆంగోత్ బిందు హాజరై విద్యార్థులతో కలిసి కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో ఆర్సీఓ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కురవి వీరన్న సన్నిధిలో పూజలు..

కురవి: మంత్రి కేటీఆర్ జన్మదినోత్సవం సందర్భంగా సోమవారం మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి వారిని మంత్రి సత్యవతి రాథోడ్ దర్శించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మంత్రి కేటీఆర్ నిండునూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని, రాష్ట్రానికి, దేశానికి సేవలందించాలని వీరభద్రస్వామిని వేడుకున్నట్లు తెలిపారు. టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి సాగుకు మూడు గంటల కరెంటు చాలని మాట్లాడడం దారుణమన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ అంగోత్ బిందు, జెడ్పీటీసీ బండి వెంకటరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కొంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, కొమ్మినేని రవీందర్, గుగులోత్ శ్రీరాంనాయక్ పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

మహబూబాబాద్: ముస్లింల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. ముస్లింలకు రూ.లక్ష ఆర్థికసాయం అందజేయాలని సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయాన్ని హర్షిస్తూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ముఖ్యమంత్రి ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఆంగోత్ బిందు, ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

గార్లలో భారీవర్షం

గార్ల: గార్లలో సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపిలేకుండా వర్షం కురవడంతో ప్రధాన వీధులన్నీ జలమయమయ్యాయి. దీంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటికి రాలేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొందరి ఇళ్లలోకి వర్షపునీరు చేరింది.



గార్లలో భారీ వర్షానికి జలమయమైన రహదారి

100 పడకల ఆస్పత్రిగా తొర్రూరు పీహెచ్‌సీ

తొర్రూరు: తొర్రూరు వాసుల చిరకాల వాంఛ నెరవేరింది. మెరుగైన వైద్యం కోసం ఇక సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. తొర్రూరులోనే నాణ్యమైన వైద్యం అందనుంది. 30 పడకల స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కార్యదర్శి ఎస్ఏఎం రిజ్వి ఉత్తర్వులు వెలువరించారు. కాగా నూతన ఆస్పత్రి ఏర్పాటుకు రూ.36 కోట్లు కేటాయించారు. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కృషి ఫలించింది. గతంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు తొర్రూరు వచ్చిన సందర్భంలో మంత్రి దయాకర్‌రావు, స్థానికుల అభ్యర్థన మేరకు పీహెచ్‌సీని 100 పడకల ఆస్పత్రిగా మారుస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేయడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.



100 పడకల ఆస్పత్రిగా మారనున్న తొర్రూరు ప్రభుత్వ దవాఖాన

మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలి



తొర్రూరులో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం, సీపీఐ నాయకులు

తొర్రూరు: మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలని, మహిళలకు రక్షణ కల్పించాలని సీపీఐ రాష్ట్ర నాయకులు తమ్మెర విశ్వేశ్వరరావు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బొల్లం అశోక్ అన్నారు. మణిపూర్‌లో మహిళలపై అఘాయిత్యాలను నిరసిస్తూ సీపీఐ, సీపీఎంల ఆధ్వర్యంలో సోమవారం డివిజన్ కేంద్రంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మణిపూర్‌లో గిరిజనులపై గిరిజనేతరుల దాడి అప్రజాస్వామికమన్నారు. దేశంలో మహిళలకు రక్షణ కరవైందని, మహిళలను వివస్త్రలను చేయడం సిగ్గు చేటన్నారు. ఈ ఘటనపై రాష్ట్రపతి స్పందించకపోవడం బాధాకరమన్నారు. మణిపూర్ ప్రభుత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం, సీపీఐ నాయకులు ఎండీ యాకూబ్, బందు మహేందర్, గణపురం లక్ష్మణ్, జమ్ముల శ్రీను, దర్గయ్య, మల్లయ్య, ప్రభాకర్, కాంతం పాల్గొన్నారు.

టీఎంవైఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నవీన్




తొర్రూరు: తెలంగాణ ముదిరాజ్ యువజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శిగా పట్టణానికి చెందిన కాగు నవీన్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు దారం యువరాజ్ ప్రకటించారు. ముదిరాజ్‌ల సమస్యలపై ముందుండి పోరాడుతానని, తన నియామకానికి సహకరించిన రాష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

పెద్దగుట్ట అందాలు.. కనుల విందు

ఆకాశంలో కమ్ముకున్న కారుమబ్బులు.. ఇటీవల కురుస్తున్న చిరుజల్లుల సవ్వడి.. తీరొక్క చెట్లతో పచ్చదనం పరుచుకున్న ఎత్తైన గుట్ట అందాలు చూపరులను కనువిందు చేస్తున్నాయి. బయ్యారం పెద్దగుట్టను తాకుతున్నట్లు కనిపించిన మబ్బుల సుందర దృశ్యాలను 'సాక్షి' తన కెమెరాలో బంధించింది.

- బయ్యారం



కాల్వలో బోల్తాపడిన స్కూల్‌ బస్సు

- పలువురు విద్యార్థులకు స్వల్పగాయాలు
- సెల్‌ఫోన్‌ మాట్లాడుతూ డ్రైవింగ్‌ చేయడమే కారణం


కాలువలో బోల్తాపడిన స్కూల్‌ బస్సు


గాయాలపాలైన విద్యార్థులు

కేసముద్రం: పాఠశాల నుంచి పిల్లలను ఇంటికి తీసుకెళ్తున్న ఓ ప్రైవేట్‌ స్కూల్‌ బస్సు మాదవశాత్తు రోడ్డు వెంట ఉన్న కాల్వలో బోల్తాపడిన సంఘటన మహబూబాబాద్‌ జిల్లా కేసముద్రం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై తిరుపతి, స్థానికుల కథనం ప్రకారం.. కేసముద్రంస్టేషన్‌లోని ఓ ప్రైవేట్‌ స్కూల్‌లో చదువుతున్న 22 మంది విద్యార్థులను సోమవారం సాయంత్రం బస్సులో ఇంటికి తీసుకెళ్తున్నారు. బైపాస్‌ రోడ్డు మూలమలుపు సమీపానికి వచ్చిన సమయంలో.. డ్రైవర్‌ శ్రీకాంత్‌ సెల్‌ఫోన్‌ మాట్లాడుతూ డ్రైవింగ్‌ చేస్తుండడంతో బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కనున్న కాల్వలో బోల్తా కొట్టింది. దీంతో బస్సులో ఉన్న పిల్లలంతా గట్టిగా అరుస్తూ కేకలు పెట్టారు. వెనకాల ఉన్న అద్దాన్ని డ్రైవర్‌ కాలుతో తన్నడంతో ఊడిపోగా.. బస్సులోని కొంత మంది పిల్లలను అతడు బయటకు తీశాడు. తర్వాత జనం గూమికూడుతున్న క్రమంలో డ్రైవర్‌ పరారయ్యాడు. స్థానికులు మిగతా పిల్లలను బస్సులో నుంచి సురక్షితంగా బయటకు తీశారు. ఈ ఘటనలో బేరువాడకు చెందిన వర్షిత్‌, బోడమంచ్యాతండాకు చెందిన బోడ మణికంఠ, సిద్ధూ, ఆనంద్‌, చందన, ధరణితోపాటు పలువురు విద్యార్థులకు కంటి వద్ద, చేతులకు, వీపుభాగంలో గాయాలయ్యాయి. వారిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. అయితే కాలవ్లో విపరీతంగా చెట్లతీగలు అల్లుకుపోవడం వల్ల బస్సు నెమ్మదిగా ఒరిగి కాలువకు మరోవైపు రాతిగోడకు తాకి పడటంతో పిల్లలకు పెద్దప్రమాదం తప్పినట్లు స్థానికులు చెబుతున్నారు. సంఘటన స్థలాన్ని ఎస్సై తిరుపతి, తహసీల్దార్‌ సాంబశివుడు చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా ఇదే బైపాస్‌ రోడ్డులో కొద్దినెలల క్రితం రోడ్డు వెంట ఉన్న వ్యవసాయబావిలో కారుపడి నలుగురు మృతిచెందిన విషయం తెలిసిందే. కాగా జరిగిన ఘటన పట్ల పాఠశాల యాజమాన్యం బాధ్యత వహించాలంటూ, డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని యూత్‌కాంగ్రెస్‌, ఎన్‌ఎస్‌యుఐ నాయకులు ఆ పాఠశాల వద్దకు చేరుకుని డిమాండ్‌ చేశారు.

'సాగు'ముమ్మరం..


మానుకోట మండలంలో సాగులో ఉన్న పత్తి, మొక్కజొన్న చేన్లు

పాడి-పంట

విస్తారంగా కురుస్తున్న వర్షాలు

- వ్యవసాయ పనుల్లో అన్నదాతలు నిమగ్నం
- పంటల్లో చేపట్టాల్సిన చర్యలపై శాస్త్రవేత్తల సూచనలు

మహబూబాబాద్‌ రూరల్‌ : ఖరీఫ్‌ సీజన్‌ ప్రారంభమైంది. వర్షాలు కొంత ఆలస్యమైనా ప్రస్తుతం విస్తారంగా కురుస్తున్నాయి. ఫలితంగా చెరువులు, వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. దీంతో అన్నదాతలు సాగు పనుల్లో నిమగ్నమవుతున్నారు. ఈ నేపథ్యంలో వివిధ పంటల సాగులో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యల గురించి మహబూబాబాద్‌ మండలంలోని మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్‌ డాక్టర్‌ ఎస్‌.మాలతి, శాస్త్రవేత్త ఎన్‌.కిషోర్‌కుమార్‌.. రైతులకు సూచనలు తెలిపారు.

పత్తి..

- సాధ్యమైనంత మేరకు పొలంలో నీరు నిలవ్వకుండా చూడాలి.
- నీరు నిల్వ ఉంటే కాలువలు ఏర్పాటుచేసి బయటకు పంపించాలి.
- వర్షాలు తగ్గిన తరువాత అదును చూసుకుని వీలైనంత త్వరగా అంతరకృషి (పాటు) చేయాలి
- దీని వల్ల భూమిలో తేమ తగ్గడం, వేర్లకు గాలి, పోషకాలు అందడంతో మొక్కలు త్వరగా సాధారణ స్థితికి వస్తాయి.
- భూమిలో తేమ అధికంగా ఉన్నప్పుడు వేర్లు పోషకాలు, నీటిని తీసుకోలేక ఆకులు లేత ఆకుపచ్చ రంగులోకి మారుతాయి.
- దీనివల్ల పెరుగుదల తగ్గుతుంది. ఈ నేపథ్యంలో పైరుపై 10 గ్రాముల పొటాషియం నైట్రేట్‌ను లీటర్‌ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- భూమిలో అధిక తేమ ఉన్నప్పుడు వేరుకుళ్లు తెగులు ఆశించి మొక్కలు చనిపోతాయి.
- దీని నివారణకుగాను కాపర్‌ఆక్సిక్లోరైడ్‌ 3 గ్రాములు లేదా కార్బండిజం 2 గ్రాములను లీటర్‌ నీటిలో కలిపి ద్రావణాన్ని తెగులు సోకిన మొక్క మొదళ్లలో పోయాలి.

మిరప..

- ప్రస్తుతం మిరప నారుమడి దశలో ఉంది.
- ఈ వర్షాల వల్ల నారుమడిలో నారుకుళ్లు తెగులు ఆశించే అవకాశం ఉంది.
- దీని నివారణకుగాను మూడు గ్రాముల కాపర్‌ ఆక్సిక్లోరైడ్‌ను లీటర్‌ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- విత్తనం ఒత్తుగా విత్తొద్దు. నారుకుళ్లు కనిపించిన వెంటనే తడులను ఆపాలి.

ఆరుతడి పంటలు..

- మిగతా ఏ పంటలలోనైనా నీరు నిలువ ఉండకుండా ఎప్పటికప్పుడు వెళ్లిపోయేలా చూడాలి.
- వర్షాలు తగ్గిన తరువాత, అదునుచూసి అంతరకృషి చేయాలి.
- వేరుకుళ్లులాంటి తెగులు ఆశిస్తే వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.

వరినాట్లు..

- వరి ప్రస్తుతం నారుమడి దశలో ఉంది.
- నారు తీయడానికి ఏడురోజుల ముందు సెంట్‌ నారుమడికి 160 గ్రాముల కార్బోఫ్యూరాన్‌ గుళికలు ఇసుకలో కలిపి పలుచగా నీరుంచి వేయాలి.
- దీనివల్ల ప్రధాన పొలంలో వచ్చే ఉల్లికోడు ఉధృతిని, కాండం తొలుచు పురుగు ఉధృతి అరికట్టొచ్చు.
- నారు తీసేటప్పుడు మొక్కలు లేత ఆకుపచ్చగా ఉంటే మునా త్వరగా తిరుగుతుంది.
- నాలుగు నుంచి ఆరు ఆకులు ఉన్న నారును ఉపయోగించుకోవాలి.
- నాటిన తరువాత ప్రతి రెండు మీటర్లకు 20 సెంటీమీటర్ల బాటలు తీయడం వల్ల పైరుకు గాలి వెలుతురు బాగా సోకి చీడపీడల ఉధృతి కొంత వరకు అదుపుచేయొచ్చు.
- ఈ గాలిబాటలు ఎరువులు చల్లడానికి, సస్యరక్షణ మందులు పిచికారీ చేసేటప్పుడు వెసులుబాటుగా ఉంటాయి.
- మొత్తం భాస్వరం ఎరువు దమ్ములోనే వేయాలి.
- పొటాష్‌ ఎరువులను రేగడి నేలల్లో ఆఖరి దమ్ములో పూర్తిగా ఒకేసారి వేయాలి.
- తేలిక భూముల్లో ఆఖరి దమ్ములో సగం అంకురం ఏర్పడే దశలో సగం వేయాలి.
- ఆఖరి దమ్ములో 20 కిలోల జింకు సల్ఫేట్‌ వేయాలి.
- రైతులు నారు పోసుకోవాలంటే స్వల్పకాలిక రకాలను వేసుకోవచ్చు.లేదా దమ్ము చేసిన పొలంలో వరిని నేరుగా విత్తే పద్ధతి ద్వారా, వెదజల్లే పద్ధతి లేదా డ్రమ్‌సీడర్‌ ద్వారా వేసుకోవాలి.
- ఈ పద్ధతిలో కాండం ధృడంగా ఉండే రకాలు ఎన్నుకుంటే బాగుంటుంది.

కేయూలో ప్రొఫెసర్‌ క్వార్టర్‌లో చోరీ


తలుపులు పగులగొట్టిన దుండగులు

కేయూ క్యాంపస్‌ : కాకతీయ యూనివర్సిటీలో ఓ ప్రొఫెసర్‌ క్వార్టర్‌లో చోరీ జరిగిన ఘటన ఆలస్యంగా సోమవారం వెలుగు చూసింది. ఆంగ్ల విభాగంలోఅసోసియేట్‌ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందిన రేణుక.. ప్రొఫెసర్‌ క్వార్టర్‌ –2(పీ2)లో ఉంటున్నారు. క్వార్టర్‌కు తాళం వేసి ఇటీవల హైదరాబాద్‌కు వెళ్లారు. అక్కడే కొద్దిరోజులుగా ఉన్నారు. ఈ క్రమంలో క్వార్టర్‌ తలుపులు పగలగొట్టి ఉన్నాయనే సమాచారం మేరకు రేణుక తన భర్తతో కలిసి హైదరాబాద్‌ నుంచి యూనివర్సిటీకి వచ్చారు. వెంటనే కేయూ సెక్యూరిటీ ఆఫీసర్‌, కేయూ పోలీస్టేషన్‌కు సమాచారం ఇవ్వగా.. ఎస్సై వచ్చి వివరాలు సేకరించారు. బీరువాలు తెరిచి సామన్లు చిందరవందర చేశారని, ఇతర విలువైన డాక్యుమెంట్లు కనపడటంలేదని పోలీసుకు ఫిర్యాదు చేశారు.

మెడికల్‌ షాపులో..

- రూ.15వేల నగదు అపహరణ

రఘునాథపల్లి: మండల కేంద్రంలోని ఆక్సిజన్‌ మెడికల్‌ షాపులో సోమవారం తెల్లవారు జామున చోరీ జరిగింది. రఘునాథపల్లికి చెందిన బైరగోని నవీన్‌ అండర్‌పాస్‌ వద్ద మెడికల్‌ షాపు నిర్వహిస్తున్నాడు. ఆదివారం రాత్రి షాపు షెట్టర్‌కు తాళం వేసి ఇంటికి వెళ్లారు. ఉదయం షాపు తెరిచేందుకు రాగా షెట్టర్‌ తాళాలు పగులకొట్టి ఉన్నాయి. దీంతో చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. ఎస్సై రఘుపతి సిబ్బందితో కలిసి షాపు వద్దకు చేరుకొని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. క్యాష్‌ కౌంటర్‌లో ఉన్న రూ. 15వేల నగదును అపహరించినట్లు గుర్తించారు. క్లూస్‌టీమ్‌ క్యాష్‌ కౌంటర్‌ , తాళాలపై వేలి ముద్రలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. అలాగే, ఓ సెల్‌ షాపులో దుండగులు చోరీకి యత్నించగా షెట్టర్‌ లాక్‌ తెరుచుకోకపోవడంతో వెనుదిరిగారు.

రాజేష్‌ కన్నా సేవలు మరువలేనివి..

- టీపీయూఎస్‌ రెండు జిల్లాల బాధ్యులు


రాజేష్‌కన్నా మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న టీపీయూఎస్‌ బాధ్యులు

విద్యారణ్యపురి: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(టీపీయూఎస్‌) హనుమకొండ జిల్లా పూర్వ అధ్యక్షుడు కొల్లూరు రాజేష్‌కన్నా సేవలు మరలేనివని టీపీయూఎస్‌ రెండు జిల్లాల బాధ్యులు అన్నారు. కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న కొల్లూరు రాజేష్‌కన్నా సోమవారం ఉదయం హనుమకొండలోని తన నివాసంలో మృతి చెందారు. కాగా, రాజేష్‌ కన్నా హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా, ఆత్మకూరు, హసన్‌పర్తి మండలాల అధ్యక్షుడిగా, ఉమ్మడి వరంగల్‌ జిల్లా ఉపాధ్యక్షుడిగాను సేవలు అందించారు. వరంగల్‌ అర్బన్‌ జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు అందుకున్నారు. టీపీయూఎస్‌ హనుమకొండ ,వరంగల్‌ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆముదాల దాత మహర్షి, బత్తిని వెంకటరమణ, బద్దిని వీరస్వామి, ఉప్పుల సతీష్‌, ఉమ్మడి వరంగల్‌ జిల్లా ఆ సంఘం నాయకులు పిన్నింటి బాలాజీరావు, చిదురాల సుధాకర్‌, దాస్యం రామానుజస్వామి, మాచర్ల భిక్షపతి.. రాజేష్‌కన్నా మృతదేహానికి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాజేష్‌కన్నా మృతి టీపీయూఎస్‌కు తీరని లోటన్నారు. కాగా, హనుమకొండ ఎంఈవో రాంకిషన్‌రాజు, డీఈవో కార్యాలయం కమ్యూనిటీ మొబైలిజింగ్‌ కోఆర్డినేటర్‌బి రాధ కూడా నివాళులర్పిచారు.

అప్పుల బాధతో కౌలురైతు ఆత్మహత్య


గోవిందు(ఫైల్‌)

గీసుకొండ: వరంగల్‌ జిల్లా గీసుకొండ మండలం నందనాయక్‌తండాకు చెందిన కౌలు రైతు బాధావత్‌ గోవిందు (43) అప్పులబాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య, పోలీసుల కథనం ప్రకారం.. గోవిందు తమ గ్రామ శివారు కాంద్ర మాధవరావు రైతుకు చెందిన 2 ఎకరాల భూమిని మూడేళ్ల నుంచి కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. పెట్టుబడి కోసం గ్రామంలోని పలువురి వద్ద సుమారు రూ.6 లక్షల వరకు అప్పు తీసుకున్నాడు. పంటలు సరిగా పండకపోవడం, అప్పులు తీరక జీవితంపై విరక్తి చెంది ఈనెల 22న కొమ్మాల పెట్రోల్‌ బంక్‌ సమీపంలో క్రిమిసంహారక మందు తాగిన గోవిందు.. ఇంటికి చేరాడు. కుటుంబ సభ్యులు గుర్తించి వరంగల్‌ ఎంజీఎం ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. సోమవారం మృతుడి భార్య సుశీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గీసుకొండ ఇన్‌స్పెక్టర్‌ రామకృష్ణ తెలిపారు. కాగా మృతుడి కుటుంబ సభ్యులను కాంగ్రెస్‌ నాయకులు తుమ్మనపెల్లి శ్రీనివాస్‌, చాడ కొమురారెడ్డి, నాగారపు స్వామి, ఆకుల రుద్రప్రసాద్‌ తదితరులు పరామర్శించి ఇనగాల చారిటబుల్‌ ట్రస్టు ద్వారా ఆర్థిక సాయం అందజేశారు.

ధన్వాడలో మరోవ్యక్తి..


శంకరయ్య(ఫైల్‌)

కాటారం: బిడ్డ పెళ్లికి చేసిన అప్పులు తీర్చలేక జీవితంపై విరక్తి చెందిన వ్యక్తి.. ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన కాటారం మండలం ధన్వాడలో జరిగింది. గ్రామానికి చెందిన బోడ శంకరయ్య(50) కొంత కాలం క్రితం తన కూతురు వివాహం చేశాడు. దీంతో పాటు కొంత భూమి కౌలుకు తీసుకొని పత్తిసాగు చేయగా రూ.5లక్షల మేర అప్పు అయింది. అప్పు ఎలా తీర్చాలని తీవ్ర మనోవేదనకు గురైన శంకరయ్య సోమవారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై మృతిడి భార్య బోడ సీరజ ఫిర్యాదు మేరకు కేసు నమెదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అభినవ్‌ తెలిపారు.

పెగడపల్లిలో వివాహిత..

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం పెగడపల్లికి చెందిన ఓ వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గ్రామానికి చెందిన గంద్రాతి అరుణ కుమారుడు గురువర్ధన్‌ రెండేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అప్పటి నుంచి అరుణ మానసిక వేదనతో బాధపడుతోంది. ఈ క్రమంలో సోమవారం ఉదయం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. దీనిపై మృతురాలి భర్త గంద్రాతి రాజేందర్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజ్‌కుమార్‌ తెలిపారు.

మద్యం తాగొద్దని మందలించినందుకు..

- అన్నను చంపిన తమ్ముడు
- శంకరాజుపల్లిలో ఘటన

ఏటూరునాగారం: మద్యం తాగి ఆరోగ్యం పాడుచేసుకోవద్దని తమ్ముడిని అన్న మందలించాడు. దీనికి కోపోద్రెకుడైన తమ్ముడు..అన్నను రోకలితో మోదీ చంపాడు. ఈ ఘటన సోమవారం ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం శంకరాజుపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన యానక ముత్తయ్య(55), యానక బాబు అన్నాదమ్ముళ్లు. ఈ క్రమంలో మద్యం సేవించి ఆరోగ్యం పాడుచేసుకోవద్దని తమ్ముడు బాబును అన్న ముత్తయ్య మందలించాడు. దీనిని మనసులో పెట్టుకున్న బాబు.. భోజనం చేసేందుకు పంపు వద్ద చేతులు శుభ్రం చేసుకుంటున్న క్రమంలో ముత్తయ్యను రోకలితో మోదాడు. దీంతో ముత్తయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై మృతుడి కుమారుడు దయాకర్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మండల రాజు తెలిపారు. నిందితుడు పరారీలో ఉన్నారన్నారు.

కాళోజీ ఖ్యాతిని తెలిపేలా నిర్మాణం

- చీఫ్‌ విప్‌ దాస్యం వినయ్‌ భాస్కర్‌, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్‌


కాళోజీ కళాక్షేత్రం నిర్మాణంపై చర్చిస్తున్న చీఫ్‌విప్‌ దాస్యం, ఎమ్మెల్సీ దేశపతి, 'కుడా' చైర్మన్‌

హన్మకొండ/వరంగల్‌ కల్చరల్‌: కాళోజీ ఖ్యాతిని తెలిపేలా కాళోజీ కళాక్షేత్రం నిర్మాణం ఉండాలని ప్రభుత్వ చీఫ్‌విప్‌ దాస్యం వినయ్‌ భాస్కర్‌, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్‌ అన్నారు. కాళోజీ కళాక్షేత్రం నిర్మాణ పనులపై సోమవారం హైదరాబాద్‌ రవీంద్రభారతిలో 'కుడా' చైర్మన్‌ సంగం రెడ్డి సుందర్‌ రాజ్‌ యాదవ్‌ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర, భాషా, సాంస్కృతిక మండలి సంచాలకుడు మామిడి హరికృష్ణ, 'కుడా' సీపీఓ అజిత్‌ రెడ్డి, డీఈఈ రఘునందన్‌ రావు, కాళోజీ ఫౌండేషన్‌ అధ్యక్షుడు నాగిళ్ల రామశాస్త్రి, కార్యదర్శి వీఆర్‌ విద్యార్థి, శ్రీనివాస్‌రావు, అశోక్‌, నిర్మాణ బాధ్యుడు నవీన్‌ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్‌ భాస్కర్‌, దేశపతి శ్రీనివాస్‌ మాట్లాడుతూ కాళోజీ కళాక్షేత్ర నిర్మాణంపై సీఎం కేసీఆర్‌ ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ఈ నేపథ్యంలో నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కాళోజీ ప్రాముఖ్యం, విశిష్టత, చరిత్ర తెలిపేలా నిర్మాణ పనుల్లో ప్రత్యేక చొరవ చూపాలన్నారు. కాళోజీ రచనలు, పుస్తకాలు, వస్తువులు ప్రత్యేకంగా పొందుపరచాలని సూచించారు. కాళోజీ జీవిత చరిత్రపై డాక్యుమెంటరీ రూపొందించి ప్రదర్శించాలన్నారు. కాళోజీ విగ్రహం, చిత్ర మాలికలకు ప్రత్యేక స్థానాలు కేటాయించాలన్నారు. 'కుడా' చైర్మన్‌ సుందర్‌రాజ్‌ యాదవ్‌ మాట్లాడుతూ కళాక్షేత్ర నిర్మాణంలో అత్యున్నత ప్రమాణాలు పాటించాలన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా నిర్మాణం ఉండాలన్నారు.

కమిషనరేట్‌కు పలువురు ఇన్‌స్పెక్టర్ల బదిలీ



వరంగల్‌ క్రైం: రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న పలువురు ఇన్‌స్పెక్టర్లను వరంగల్‌ పోలీస్‌ కమిషనరేట్‌కు బదిలీ చూస్తు డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. ఆదిలాబాద్‌ నుంచి ఎల్‌.ప్రవీన్‌కుమార్‌, ఖమ్మం నుంచి ఎస్‌.రవికుమార్‌, సిద్దిపేట నుంచి రాజశేఖర్‌రెడ్డి, జయశంకర్‌ భూపాలపల్లి నుంచి పులి వెంకట్‌, ఆదిలాబాద్‌ నుంచి జి.సతీష్‌కుమార్‌, జూలూరుపాడు సర్కిల్‌ నుంచి తాటపాముల సురేష్‌, ఎన్‌.చంద్రమోహన్‌ను కమిషనరేట్‌కు బదిలీ చేస్తే ఉత్తర్వులు వెలువడ్డాయి.

విద్యుదాఘాతంతో రైతు మృతి


యాకూబ్‌రెడ్డి(ఫైల్‌)

జనగామ రూరల్‌: ఓ రైతు.. తన పొలం వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ మరమ్మతుకు గురి కావడంతో మరో ట్రాన్స్‌ఫార్మర్‌ నుంచి విద్యుత్‌ కనెక్షన్‌ ఇస్తున్నాడు. ఈ క్రమంలో విద్యుదాఘాతం సంభవించి మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం మండలంలోని గోపిరాజుపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన లింగాల యాకూబ్‌రెడ్డి (35)కి రెండు ఎకరాల పొలం ఉంది. ట్రాన్స్‌ఫార్మర్‌ మరమ్మతుకు గురికావడంతో జనగామ విద్యుత్‌ కార్యాలయానికి తీసుకెళ్లాడు. అక్కడ అధికారులు కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ మంగళవారం అందజేస్తామని తెలిపారు. దీంతో నీరులేక తన పొలం ఎండుతుండంతో సమీపంలో ఉన్న మరో ట్రాన్స్‌ఫార్మర్‌ నుంచి స్టార్టర్‌కు కనెక్షన్‌ ఇస్తుండగా ఒడ్డుపై జారిపడ్డాడు. ఈ క్రమంలో తన చేతికి కరెంట్‌ ప్రసరిస్తున్న తీగ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలికి ఎస్సై అరుణ్‌ చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. కాగా, మృతుడికి ఇద్దరు పిల్లలు, భార్య అక్షిత ఉన్నారు.

గుట్టపై నుంచి పడి యువకుడు..


సాయికుమార్‌(ఫైల్‌)

పాలకుర్తి: మండలంలోని విస్నూరు గ్రామ గుట్టపై నుంచి పడి ఓ యువకుడు మృతి చెందాడు. గ్రామానికి చెందిన జనగామ సాయికుమార్‌(26) సోమవారం మద్యం తాగాడు. అనంతరం గుట్టపైకి వెళ్లగా జారి పడ్డారు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు సాయికుమార్‌ అప్పటికే మృతి చెందాడని ధ్రువీకరించారు. దీనిపై మృతుడి తండ్రి రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రీకాంత్‌ తెలిపారు.

చిట్టీలు వేసి నష్టపోయాం..

- మోసగించిన వ్యక్తికి చెందిన భూమి అప్పగించి న్యాయం చేయాలి
- పల్లారుగూడ స్వయం సహాయక సంఘాల మహిళల వినతి


ఇన్‌చార్జ్‌ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

సంగెం: పొదుపు సంఘం, చిట్టీల పేరుతో సుమారు 500 మందిని మోసం చేసి సుమారు రూ.1.50కోట్లతో ఊడాయించిన వ్యక్తికి సంబంధించి భూమిని తమకు అప్పగించాలని మహిళలు వేడుకుంటున్నారు. వరంగల్‌ నగరంలోని అబ్బనికుంటకు చెందిన వేములపల్లి సంపత్‌.. 'వెంకటలక్ష్మి పొదుపు సంఘం' పేరుతో సంగెం మండలం పల్లారుగూడ గ్రామానికి చెందిన సుమారు 500 మంది మహిళల వద్ద నెలనెలా పొదుపుతో పాటు చిట్టీలు నిర్వహించాడు. అనంతరం ఏడళ్ల క్రితం సుమారు రూ 1.50లతో ఊడాయించాడు. అతడికి సంబంధించి గ్రామంలో 5 గుంటల భూమి ఉంది. ఆ భూమిని గ్రామానికి చెందిన సమ్మయ్య అక్రమంగా వినియోగించుకుంటున్నాడు. దీనిపై విచారణ చేపట్టి ఆ భూమిని పొదుపు, చిట్టీలు వేసి నష్టపోయిన తమకు అప్పగించాలని వారు వేడుకుంటున్నారు. ఈ మేరకు శనివారం ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికి, సోమవారం ఇన్‌చార్జ్‌ తహసీల్దార్‌ రాజేశ్వర్‌ రావు, ఎస్సై భరత్‌కు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పల్లారుగూడ స్వయం సహాయక సంఘాల మహిళలు గుర్రం గీత, బి.పద్మ, సరస్వతి, విజయ, అరుణ, భాగ్యమ్మ, మణమ్మ సుభద్ర తదితర పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ సర్కారును బొంద పెట్టడం ఖాయం

- పేదలకు డబుల్‌ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలి
- బీజేపీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్‌ ఈటల రాజేందర్‌


హనుమకొండ : ధర్నాలో మాట్లాడుతున్న ఈటల, పాల్గొన్న నాయకులు

హన్మకొండ/వరంగల్‌: పేద ప్రజలకు సీఎం కేసీఆర్‌ డబుల్‌ బెడ్రూం ఇళ్ల ఇవ్వకపోతే బీఆర్‌ఎస్‌ ప్రభుత్వాన్ని బొంద పెట్టడం ఖాయమని బీజేపీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్‌, ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ అన్నారు. పేదలకు డబుల్‌ బెడ్రూం ఇవ్వాలని డిమాండ్‌ చేస్తూ సోమవారం బీజేపీ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం హనుమకొండ కలెక్టరేట్‌ ఎదుట, పోచమ్మమైదాన్‌ జంక్షన్‌లో బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్‌ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లయినా అర్హులైన పేదలకు డబుల్‌ బెడ్రూం ఇళ్లు కట్టియ్యలేని చేతకాని ప్రభుత్వం కేసీఆర్‌ నాయకత్వంలో కొనసాగుతోందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్‌ హయంలో వేల కోట్లతో కట్టిన రాజీవ్‌ గృహకల్ప ఇళ్లే ఇంత వరకు ఎవరికీ ఇవ్వలేదని.. దీనిని బట్టి చూస్తే పేదవాళ్లపై ఆయనకు ఎంత మమకారం ఉందో అర్థమవుతోందని అన్నారు. రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతోందని, పేదలు సంపాదిస్తున్న కూలీ బార్లకే పోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామాల్లో వాడ వాడకు బెల్ట్‌ షాపులే రాష్ట్ర అభివృద్ధా అని నిలదీశారు. సీఎం కేసీఆర్‌ కల్లబొల్లి మాటలతో ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం వస్తే పేదలందరికీ డబుల్‌ బెడ్రూం ఇళ్లు కట్టిస్తామని, ఇంట్లో ఇద్దరు దంపతులకు వృద్ధాప్య పింఛన్‌ ఇస్తామన్నారు. వేర్వేరుగా జరిగిన ఆయా కార్యక్రమాల్లో పార్టీ హనుమకొండ, వరంగల్‌ జిల్లాల అధ్యక్షులు రావు పద్మ, కొండేటి శ్రీధర్‌, జిల్లా ఇన్‌చార్జ్‌ డాక్టర్‌ వి.మురళీధర్‌ గౌడ్‌, మాజీ ఎమ్మెల్యేలు మార్తినేని ధర్మారావు, మోలుగురి భిక్షపతి, వన్నాల శ్రీరాములు, చాడ శ్రీనివాస్‌ రెడ్డి, రాకేష్‌ రెడ్డి, గురుమూర్తి శివకుమార్‌, పేసరు విజయచందర్‌రెడ్డి, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, ఎడ్ల అశోక్‌రెడ్డి, వంగాల సమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'టాస్క్‌ఫోర్స్‌' అదుపులో భూకబ్జాదారులు..!

వరంగల్‌ క్రైం: వరంగల్‌ పోలీస్‌ కమిషనరేట్‌ పరిధిలో కబ్జాలకు పాల్పడుతున్న కొంత మందిని టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. వరంగల్‌ పోలీస్‌ కమిషనర్‌గా ఏవీ.రంగనాథ్‌ బాధ్యతలు స్వీకరించిన తరువాత కబ్జాదారులపై ఉక్కుపాదాం మోపడంతో వందల సంఖ్యలో పోలీస్‌ స్టేషన్లకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో భూకబ్జాలకు పాల్పడుతున్న కొంత మందిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. నకిలీ పత్రాలు సృష్టించి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న వారిని విచారిస్తున్నట్లు సమాచారం.